సాక్షి
మెదక్
శుక్రవారం । 13 । జనవరి । 2023
I



మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు
హుస్నాబాద్ రూరల్ మండలం పొట్లపల్లి గ్రామంలో పురాతన మల్లికార్జున స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. IIలో



ట్యాంకు ఎక్కి హల్‌చల్
చేగుంటలో ఓ వ్యక్తి ట్యాంక్ ఎక్కి హల్ చేశాడు. తన సమస్యను పరిష్కరించాలని, లేదంటే కిందకు దూకుతానని డిమాండ్ చేశాడు. IIలో



ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం
ప్రజలు ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలో అధికారులతో మాట్లాడారు. IIIలో

నీరున్నా.. పంట ఎండే

జిల్లాలో అప్రకటిత విద్యుత్ కోతలు
- సమయాన్ని తగ్గిస్తున్న అధికారులు
- ఆందోళనలో అన్నదాతలు



గవ్వలపల్లిలో నీరందక ఎండుతున్న పొలం

మెదక్‌జోన్: పంటలకు 24గంటల కరెంటు అందిస్తామని చెబుతున్న నాయకుల మాటలు నీటిమూటలుగా మారాయి. చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉన్నా అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలకు నీరు అందడంలేదు. అధికారులు అప్రకటితంగా విద్యుత్ కోతలు పెడుతుండడంతో సాగుచేస్తున్న పంటలకు ఎలా నీరందించాలో తెలియక అయోమయం చెందుతున్నారు. యాసంగి ప్రారంభంలో సాగుకు అడ్డంకులు ఏర్పడడంతో ఆదిలోనే హంస పాదు అన్నట్లు మారింది అన్నదాతల పరిస్థితి. బావిలో పుష్కలంగా నీరు ఉన్నా పొలానికి మాత్రం చుక్క పారని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. జిల్లాలో అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి.

జిల్లా వ్యాప్తంగా..
- యాసంగిలో జిల్లా వ్యాప్తంగా అన్ని పంటలు కలిపి 2,43,937 ఎకరాల్లో సాగవుతున్నాయి.
- వరి 2,10,445 ఎకరాల వరకు ఉన్నట్లు అధికారులు అంచనా.
- ఇప్పటి వరకు 91,672 ఎకరాల్లో వరిపంట సాగవగా మరో 1,18,328 ఎకరాల్లో మిగతా వరి సాగు కానుంది.
- ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులు, కుంటలతో పాటు జిల్లాలోని ఘనాపూర్, హల్దీ ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి.
- మెదక్‌లో కొన్నిచోట్ల భూ ఉపరితలానికి 8 మీటర్ల లోతులో నీరు ఉండడంతో గతంలో నీరులేక ఎండిన బోరుబావులు సైతం నీటితో నిండాయి.
- భూగర్భజలాలు సైతం పుష్కలంగా పెరగడంతో జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగుచేశారు.
- నీటి లభ్యత విస్తారంగా పెరగడంతో యాసంగిలో అధిక శాతం రైతులు వరిసాగుకు మొగ్గు చూపారు.
- జిల్లా వ్యాప్తంగా 99,275 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

తప్పని కరెంట్ కష్టాలు
- రాష్ట్రం ఏర్పాటు అనంతరం వ్యవసాయానికి 24 గంటల కరెంటును ఇస్తుండగా, ప్రస్తుతం 12 గంటలు మాత్రమే సరఫరా అవుతోంది.
- ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేస్తున్నా, అందులో లైన్ ట్రిప్, ఓవర్‌లోడ్, ఎల్‌సీ అంటూ రోజుకు 2 నుంచి 3 గంటలు కోత పెడుతున్నారని రైతులు చెబుతున్నారు.
- రోజువారి తరుగు పోను 9 నుంచి 10 గంటలు మాత్రమే విద్యుత్ అందుతుండడంతో అది సరిపోవడంలేదని రైతులు వాదన. ఇచ్చే కరెంట్‌లో కూడా కోతలు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.
- ప్రస్తుతం మొలక దశలో ఉన్న పంటలకు నీటి తడులు అందించేందుకు కరెంటు అత్యవసరం కాగా, విద్యుత్ కోతలతో సరిపడా నీరందక పంటలు ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- వేల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు కళ్ల ముందే ఎండుతున్నాయని, విద్యుత్ కోతలను తగ్గించకపోతే
- పెట్టిన పెట్టుబడి కూడా రాదని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఇలా అయితే కష్టమే



రెండెకరాల్లో వరిసాగు చేశా. ఎకరాకు రూ.10 వేల చొప్పున పెట్టుబడితో సాగు చేశా. రోజుకు 9 గంటలు మాత్రమే కరెంటు ఇస్తున్నారు. దీంతో పంటకు సరిపడా నీరు అందడంలేదు. పరిస్థితి ఇలాగే ఉంటే సాగు కష్టమే.
– ఎద్ల యాదగిరి, రైతు, గవ్వలపల్లి

12గంటలు ఇవ్వాలి



రెండు బోర్లతో నాలుగెకరాల్లో వరి పంటను సాగు చేశా. రోజుకు 9 నుంచి 10 గంటలు మాత్రమే కరెంట్ వస్తోంది. దీంతో పొలం మొత్తం పారటంలేదు. నీరందక పంట ఎండిపోతుంది. గతంలో ఇచ్చినట్లు వ్యవసాయానికి నిరంతరంగా 24 గంటల విద్యుత్ ఇవ్వాలి.
– లండాడి హరి, గవ్వలపల్లి

సమయాన్ని పెంచాం

జిల్లాలో వ్యవసాయానికి ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరంతర కరెంట్ సరఫరా చేస్తున్నాం. సమయం మార్పుల్లో భాగ ంగా ఈ నెల 12వ తేదీ నుంచి ఉదయం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమయాన్ని పెంచి విద్యుత్ సరఫరా చేస్తున్నాం.
– కృష్ణారావు, డీఈ, ట్రాన్స్‌కో

పకడ్బందీగా కంటి వెలుగు రెండో విడత

కలెక్టర్ హరీశ్



మెదక్ కలెక్టరేట్: జిల్లాలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ హరీశ్ తెలిపారు. గురువారం ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వి, కమిషనర్ శ్వేతతో కలిసి కంటి వెలుగు క్యాంపుల నిర్వహణ, తీసుకోవాల్సిన చర్యలపై నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో 4,72,802 మందికి కంటి పరీక్షలు చేసేందుకు గ్రామాల్లో 35 టీములు, పట్టణ స్థాయిలో 5 టీములు, 5 బఫర్ టీములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 469 గ్రామ పంచాయతీలు, 4మున్సిపాలిటీల్లో 75 వార్డుల్లో 544 శిబిరాల్లో పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. 40 ఏఆర్ మిషన్లు, 32,596 ట్రయల్ ఫ్రేమ్స్ జిల్లాకు వచ్చాయని, జనవరి 18 నుంచి జూన్ 26 వరకు పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులకు ఇప్పటికే ఆదేశాలిచ్చామని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి చంద్రు నాయక్, డీపీఓ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఆటల్లో గెలుపోటములు సహజం



విజేతలకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే పద్మా దేవేందర్, ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): ఆటల్లో గెలుపు, ఓటములు సాధారణమని, ఓడినవారు గెలిచిన వారిని ఆదర్శంగా తీసుకోవాలని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. యువజన దినోత్సవం సందర్భంగా సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీల్లో గెలుపొందిన వారికి గురువారం ఎస్పీ రోహిణీ ప్రియదర్శినితో కలిసి బహుమతులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని, యువత సెల్‌ఫోన్లకు బానిస కాకుండా క్రీడలపై మక్కువ పెంచుకోవాలని అన్నారు. ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని మాట్లాడుతూ గడిచిన కాలం మళ్లీ రాదని, అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా రాణించాలన్నారు. అదనపు ఎస్పీ బాలస్వామి మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముక అని అన్నారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ సైదులు, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ సరాపు యాదగిరి, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, ఎంపీపీ బిక్షపతి, తహసీల్దార్ మన్నాన్, పాల్గొన్నారు.

యువతదే రేపటి భవిత

ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: నేటి యువతదే రేపటి భవిత అని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం క్రీడోత్సవాల సందర్భంగా నిర్వహించిన 2కే రన్‌ను ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పోటీలలో ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత విద్యా, సాహితీవేత్త అయిన వివేకానందుడి మార్గంలో నడవాలని సూచించారు. యువత అవగాహన కార్యక్రమాలతో సమాజంలో మార్పు తేవొచ్చని అన్నారు. ఆసక్తి గల రంగంలో రాణించి భవిష్యత్‌లో ఉన్నతస్థాయిలో స్థిరపడాలని కోరారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ సైదులు, సీఐ మధు, పోలీసులు పాల్గొన్నారు.



బహుమతి అందిస్తున్నఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

కొల్చారం(నర్సాపూర్): యువజనోత్సవాల్లో భాగంగా మండలంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు గురువారం ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని బహుమతులను అందించినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

రేషన్ షాపుల ద్వారా పోర్టిఫైడ్ రైస్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

- అంగన్‌వాడీ, సంక్షేమ హాస్టళ్లకు పంపిణీ
- అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: ఏప్రిల్ నుంచి జిల్లాలోని 529 చౌకధర దుకాణాల ద్వారా పోర్టిఫైడ్ 2,14,890 కార్డుదారులకు బియ్యాన్ని అందిస్తామని అదనపు కలెక్టర్ రమేశ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఏర్పాటు చేసిన విజిలెన్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ ఆహార భద్రతలో భాగంగా విటమిన్లు, మినరల్స్, ఐరన్‌తో కూడిన బలవర్ధకమైన ఆహారం అందించే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులు, అంగన్‌వాడీలు, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలకు పోర్టిఫైడ్ బియ్యాన్ని అందించాలని నిర్ణయించిందని అన్నారు. ఇప్పటికే కొన్ని అంగన్‌వాడీలు, వసతి గృహాల్లో ఈ బియ్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. పోషకాహార లోపం, రక్తహీనత, వయస్సుకు తగిన ఎదుగుదల లేనట్లు గుర్తించిన ప్రభుత్వం పోర్టిఫైడ్ బియ్యాన్ని అందిస్తోందని పేర్కొన్నరాఉ. జిల్లాలోని 7 మండల స్థాయి స్టాక్ పాయింట్‌ల ద్వారా ప్రతీ నెలా అంగన్‌వాడీలు, పాఠశాలలు, వసతి గృహాలకు బియ్యాన్ని సరఫరా చేస్తామన్నారు. బియ్యం నాణ్యత, పరిమాణంలో రాజీ పడొద్దని, సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సంక్షేమ అధికారులకు సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వెంకట శైలేష్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీఎస్‌ఓ శ్రీనివాస్, ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమాధికారి బ్రహ్మాజీ, లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్, వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి
అధికారులు సమన్వయంతో పనిచేసి కంటి వెలుగు రెండో విడతను విజయంతం చేయాలని అదనపు కలెక్టర్ రమేశ్ సూచించారు. గురువారం కలెక్టరెట్‌లో రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న రెండో విడతపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని మెదక్, నర్సాపూర్, తూప్రాన్ రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. కంటి వెలుగు శిబిరాల షెడ్యూల్‌ను ఫ్లెక్సీల రూపంలో చౌక ధరల దుకాణాలు, పెట్రోల్ బంకులు, గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. శిబిరంలో ఉచిత కంటి పరీక్షతో పాటు, అవసరమైన వారికి మందులు, కళ్లజోడు అందిస్తారని మైకుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

వివేకానందుడి మార్గం అనుసరణీయం

ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి



మెదక్ మున్సిపాలిటీ: వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: స్వామి వివేకానందుడి మార్గం అనుసరణీయమని, యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ బలమే జీవనం, బలహీనతే మరణం అనే వివేకానందుడి మాటలను యువత ప్రతిక్షణం గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ఆత్మ కమిటీ చైర్మన్ యం.అంజాగౌడ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, కౌన్సిలర్లు జయరాజ్, లక్ష్మీనారాయణ గౌడ్, వసంత్ రాజ్, కో ఆప్షన్ సయ్యద్ ఉమర్, తదితరుఉ పాల్గొన్నారు.

స్ఫూర్తిగా తీసుకోవాలి
మెదక్ కలెక్టరేట్: దేశ ఔన్నత్యాన్ని నలుదిశలా చాటిన మహనీయుడు స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ రమేశ్ అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్ ఆవరణలో వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ తన ప్రసంగాల ద్వారా యువతను ఉత్తేజితులను చేసి, మార్గనిర్దేశం చేసిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. జెడ్పీ సీఈఓ వెంకట శైలేష్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీఎస్‌ఓ శ్రీనివాస్, జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు, ఏడీఏ జయరాజ్, సీపీఓ మహమ్మద్ కాసిం, నీటిపారుదల ఈఈ శ్రీనివాస్ రావు, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి బ్రహ్మాజీ, ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, జిల్లా మైనారిటీ అధికారి జెంలా, కలెక్టరేట్ ఏ.ఓ. యూనుస్, యువజన సంఘాల కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటేశం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి
మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని గ్రామీణ యువతకు బైక్ మెకానిక్‌పై నెలరోజుల పాటు ఉచిత ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 16 వరకు శిక్షణ ఉంటుందని, 30 రోజుల పాటు బైక్ ఇంజిన్, ఎలక్ట్రికల్ వైరింగ్ సిస్టమ్ నేర్పించబడుతుందన్నారు. సంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన 18 నుంచి 45ఏళ్ల లోపు ఉన్న గ్రామీణ యువత అర్హులని అన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫామ్. సర్టిఫికెట్, టూల్ కిట్ ఉచితంగా అందిస్తామన్నారు. వివాలకు 94901 03390, 94901 29839 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
మెదక్‌జోన్: ఉద్యోగుల సంక్షేమానికి సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం టీఎన్జీఓ భవనంలో ఆ సంఘం నూతన కేలండర్, డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని, ఏడుపాయల ఆలయ ఆవరణలో యూనియన్ భవనానికి స్థలం కేటాయింపునకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్, రాయకంటి ప్రతాప్, టీఎస్పీఎస్సీ మెంబర్ కారం రవీందర్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్, టిఎన్జీఓ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవి ప్రసాద్ రావు, జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, డీఏఓ తోట కుమార్, మేడిశెట్టి శ్యామ్ రావు, సూర్య శ్రీనివాస్, ప్రశాంత్, పాల్గొన్నారు.

గణపురం ప్రాజెక్ట్‌కు నీటి విడుదల
పాపన్నపేట (మెదక్): సింగూర్ నుంచి గురువారం సాయంత్రం 0.35టీఎంసీ నీటిని గణపురం ప్రాజెక్టుకు విడుదల చేసినట్లు ఇరిగేషన్ డీఈ శివనాగరాజు తెలిపారు. యాసంగి పంటలు, మాఘ అమావాస్య ఉత్సవాల సందర్భంగా నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. కాగా శనివారం నాటికి నీరు గణపురం ప్రాజెక్టుకు చేరుతుందని ఆయన తెలిపారు.

అధికారులు నిబద్ధతతో పని చేయాలి

జిల్లా వైద్యాధికారి చంద్రూనాయక్



పెద్దశంకరంపేట పీహెచ్‌సీని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి చంద్రూనాయక్

పెద్దశంకరంపేట(మెదక్): రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్యాధికారులు నిబద్ధతతో పనిచేయాలని యాలని జిల్లా వైద్యాధికారి చంద్రూనాయక్ అధికారులకు సూచించారు. గురువారం పెద్దశంకరంపేట ప్రభుత్వాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణ శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కంటి వెలుగు సామగ్రిని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. 18 ఏళ్లు నిండిన వారికి కంటి పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్లు చేపడతామని, ప్రతీ రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పేట మండలంలో 2 టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సంపూర్ణ, యాదయ్య, భూమయ్య, సాయిలు, రామ్మోహన్ తదితరులున్నారు.

రేగోడ్(మెదక్): రేగోడ్ ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం డీఎంహెచ్ఓ చంద్రూనాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందుతున్న సేవలు, ప్రసవాలపై డాక్టర్ శ్వేతను అడిగి తెలుసుకున్నారు.

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా వైద్యాధికారి చంద్రూనాయక్ సందర్శించి ఆస్పత్రి పరిశుభ్రతపై వైద్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు గ్రామాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. డాక్టర్ షాలిని, డాక్టర్ కృతిక, డాక్టర్ రజిని, ఆరోగ్య విస్తరణాధికారి సుగుణాకర్, తదితరులు ఉన్నారు.

పరిశుభ్రత ఇలాగేనా..?
అల్లాదుర్గం(మెదక్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై జిల్లా వైద్యాధికారి చంద్రూనాయక్ ఆరోగ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం అల్లాదుర్గం, గడిపెద్దాపూర్ పీహెచ్‌సీలను తనిఖీ చేసిన ఆయన , గడిపెద్దాపూర్ ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రత లోపించడంపై మండిపడ్డారు. వారం రోజుల్లో పరిస్థితి మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ పాజియా తదితరులు పాల్గొన్నారు.

ముగ్గు మీది.. ప్రచురణ మాది



రంగవల్లులు వేయడం మీకు ఇష్టమా..? ఆకర్షణీయంగా ముగ్గులు వేస్తారా..? సంక్రాంతి పండగ సందర్భంగా శనివారం మీ వాకిట్లో అందంగా వేస్తారా.. అయితే దాన్ని మాకు వాట్సాప్ చేయండి. 'సాక్షి' పత్రికలో ప్రచురిస్తాం.
ఫోన్ నంబర్: 8985554525

న్యూస్‌రీల్

రాక్రేను కలిసిన డీసీసీ అధ్యక్షుడు



రాక్రేను సన్మానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

రామాయంపేట(మెదక్): డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి గురువారం కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేను గాంధీభవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో కలిసి జిల్లాలో పార్టీ పరిస్థితిపై ఠాక్రేకు వివరించినట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం
మెదక్ కలెక్టరేట్: డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఇంటర్ సెకండియర్ పూర్తయిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయకర్త సంపత్ కుమార్ తెలిపారు. టీజీయూజీసెట్–2023 వాల్‌పోస్టర్‌ను గురువారం అదనపు కలెక్టర్ రమేశ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ ఇంటర్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ర్యాంకింగ్ కేటాయించి టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ, టీటీడబ్ల్యూఆర్ డీసీలో సీట్లను కేటాయిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 5 నుంచి దరఖాస్తులు స్వీకరణ ప్రారంభం అవుతుందని, మార్చి 5న పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీటీడబ్ల్యూఆర్‌డీసీ ప్రిన్సిపాల్ వాసంతి పిళ్లై, అధ్యాపకుల పాల్గొన్నారు.

బోధనలో మూసపద్ధతి వీడాలి
రాష్ట్ర ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ రాధారెడ్డి



దండుపల్లి పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న రాధారెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): ఉపాధ్యాయులు బోధనలో మూస పద్ధతిని వీడి విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని రాష్ట్ర విద్యాశిక్షణ, పరిశోధన సంస్థ డైరెక్టర్ రాధారెడ్డి అన్నారు. గురువారం మనోహరాబాద్ మండలందండుపల్లి, రామాయపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి, బోధన తీరును తెలుసుకున్నారు. తొలిమెట్టు ద్వారా విద్యార్థుల్లో మార్పు రావాలని సూచించారు. ప్రత్యేక తరహాలో విద్యాబోధన చేసి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంచేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి జ్యోతి, ఎంఈఓ యాదగిరి, తదితరులున్నారు. అనంతరం తూప్రాన్ మండలం యావపూర్‌లో ప్రాథమిక పాఠశాలను డీఈఓ రమేశ్‌తో కలిసి తనిఖీ చేశారు.

నాణ్యమైన బియ్యం అందించాలి
నర్సాపూర్: రేషన్ దుకాణాల ద్వారా డీలర్లు నాణ్యమైన బియ్యాన్ని ప్రజలకు పంపిణీ చేయాలని ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ వివేక్ అగర్వాల్ గురువారం సూచించారు. గురువారం నర్సాపూర్ మండల కేంద్రంతో పాటు మూసాపేట, నాగులపల్లి, జక్కపల్లి గ్రామాల్లో రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. నర్సాపూర్‌లో ఓ రేషన్ దుకాణంలో ముక్కిన బియ్యం ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ముక్కిన బియ్యం అందిస్తే ఎలా తింటారని డిప్యూటీ తహసీల్దార్ ప్రణతీరెడ్డిని ప్రశ్నించారు. ఈ–పాస్ మిషన్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. మూసాపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఆహార దినుసులను పరిశీలించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఆయనతో ఎఫ్‌సీఐ అధికారి గణేశ్, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ ఉన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులతో బస్టాండ్‌ కిటకిట



బస్టాండ్‌ ఆవరణలో విద్యార్థుల సందడి

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): సంక్రాంతి పండగను పురస్కరించుకుని ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలలకు శుక్రవారం నుంచి సోమవారం వరకు సెలవులు ప్రకటించింది. దీంతో గురువారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్‌ వసతి గృహాలు, గురుకులాల నుంచి విద్యార్థులు తమ ఇళ్ల బయలుదేరారు. విద్యార్థుల రాకతో పట్టణం, బస్టాండ్‌ పరిసర ప్రాంతాలు, బస్సులు కిటకిటలాడాయి.

నేటి నుంచి సిటీ పోలీస్‌ యాక్ట్‌

సిద్దిపేటకమాన్‌: సిద్దిపేట పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో నేటి నుంచి సిటీ పోలీసు యాక్టు అమల్లో ఉంటుందని సీపీ శ్వేత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 19వ తేదీ ఉదయం 6 గంటల వరకు ఈ యాక్టు అమల్లో ఉంటుందన్నారు. ఈ సమయంలో ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. వీటి నిర్వహణకు ముందస్తుగా పోలీసు అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యలకు శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలన్నారు. అలాగే జనవరి 19 వరకు డీజే సౌండ్‌ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కొనసాగుతాయన్నారు.

కేజ్‌వీల్స్‌ ట్రాక్టర్‌ యజమానిపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్‌): ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి వచ్చే ట్రాక్టర్‌లను సీజ్‌ చేయడంతో పాటు సంబంధిత వాహన యజమానులపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవికాంతరావు తెలిపారు. ఈ మేరకు మండలంలోని బిజిలిపూర్‌ శివారులో కేజ్‌వీల్స్‌తో బీటీ రోడ్డు ఎక్కిన నంబర్‌ ప్లేట్‌లేని ట్రాక్టర్‌ డ్రైవర్‌ బానోత్‌ రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. గతంలోనూ దంతాన్‌పల్లి శివారులో కేజ్‌వీల్స్‌తో రోడ్డుపైకి వచ్చిన ట్రాక్టర్‌ యజమానిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సొంతింటి కలకు డబుల్‌ బెడ్రూం పథకం

రాష్ట్ర హౌసింగ్‌ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ మడుపు భూంరెడ్డి

కొండపాక(గజ్వేల్‌): పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం డబుల్‌ బెడ్రూం పథకాన్ని ప్రవేశపెట్టిందని రాష్ట్ర హౌసింగ్‌ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ మడుపు భూంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మర్పడ్గ మధిక నాగిరెడ్డిపల్లిలో ప్రభుత్వం నిర్మించిన డబుల్‌ బెడ్రూం ఇళ్ల పత్రాలను లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భూంరెడ్డి మాట్లాడుతూ నాగిరెడ్డిపల్లిలో శిథిలావస్థలో ఉన్న ఇళ్ల కూల్చి వాటిస్థానంలో డబుల్‌ బెడ్రూంలను నిర్మించినట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. మరో 40 డబుల్‌ బెడ్రూం ఇళ్లను ప్రభుత్వం నిర్మించి మోడల్‌ డబుల్‌ బెడ్రూం ఇళ్ల గ్రామంగా తీర్చిదిద్దాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. డబుల్‌ బెడ్రూం ఇళ్ల నిర్మాణం కోసం రెండు ఎకరాల భూమిని విరాళంగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ రజిత ఎంపీటీసీలు ఆంజనేయులు, యాదగిరి, మాజీ సర్పంచ్‌ మల్లికార్జున్‌, నాయకులు దామ శంకరయ్య, సంతోశ్‌, దయాకర్‌రెడ్డి, మంద శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పొట్లపల్లిలో మల్లికార్జుస్వామి బ్రహ్మోత్సవాలు

- భోగి పండగ నాడు గోదాదేవి, రంగనాయకుల కల్యాణం
- మల్లన్న బోనాలు, పట్నాలు, అగ్ని గుండాలు
- మద్యం, మాంసం ముట్టని భక్తులు



జాతరకు ఎడ్లబండిని సిద్ధం చేస్తున్న రైతు కుటుంబం

హుస్నాబాద్‌రూరల్‌: పొట్లపల్లి ఊరు అధ్యాత్మకతకు నిలయం. అక్కడ నిత్య పూజలు, భగవంతుడిని అరాధిస్తుంటారు. భక్తి గీతాలు ఆలపిస్తూ దైవారాదనకే ఎక్కువ సమయం కేటాయిస్తారు. 10వ శతాబ్దములో 101 దేవాలయలకు నిలయంగా వెలసిన పొట్లపలి కాలక్రమంలో అవి కాలగర్భంలో కలిసిపోయి పుణ్యక్షేత్ర శోభను కోల్పోయింది. తర్వాత కాలంలో రావులవారి పొలంలో నాగలి కర్రుకు తాకి వెలుగు చూసింది. రావుల మల్లికార్జున స్వామి (పురాతన శైవక్షేత్రం) భక్తుల నిత్యపూజలు అందుకుంటున్నాడు. మల్లికార్జున స్వామి క్షేత్రానికి సమీపంలోనే కాకతీయుల కాలంలో నిర్మించిన శ్రీ సీతారాముల దేవాలయం ఉంది. వీటికి సమీపంలో ఓ శాలివాహనుడి ఇంటి నిర్మాణం కోసం పునాది తవ్వుతుంటే పెద్ద శివలింగం బల్పడింది. ఊరంత దేవాలయలు ఉండటం ఎప్పుడూ ఉత్సవాల పేరున గ్రామంలో అధ్యాత్మకత వెల్లి విరుస్తుంది. చుట్టుపక్కల గ్రామాలు, పొరుగు జిల్లాల నుంచి భక్తులు తరలి రావడంతో పొట్లపల్లికి ప్రత్యేక పేరు వస్తుంది.

భోగి పండగ (కల్యాణ మహోత్సవాలు)

భోగి పండక రోజున శ్రీ సీతారామాలయంలో గోదాదేవి, రంగనాయకుల కల్యాణం మహోత్సవం, మల్లికార్జునస్వామి ఆలయంలో శివకళ్యాణం మహోత్సవాలు జరుగుతాయి. వీరి కల్యాణ మహోత్సవాలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలి వస్తారు. రావుల మల్లికారునస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలు లేక పోవడంతో మూల విరాట్కే కల్యాణం నిర్వహిస్తారు. గోదాదేవి, రంగనాయక కల్యాణ మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యాహా జరవుతారు.

బోనాలు, ఎడ్ల బండ్ల జాతర

సంక్రాంతి పండగ రోజున ప్రతి ఇంటి నుంచి మల్లన్నకు బోనాలు సమర్పించి మొక్కలు చెల్లించుకుంటారు. ఒక్క రోజే ఊరంత బోనాలు చేయడం ఇక్కడ ప్రత్యేకత. ఉత్సవాలలో భాగంగా రాత్రి స్వామివారి పట్నాలు వేస్తారు. వీటిని తిలకించేందుకు ప్రజలు తరలివస్తారు. పొట్లపల్లి గ్రామంలో రాజేశ్వస్వామి ఆలయం ఉండటంతో దైవదర్శనం చేసుకునేందుకు భక్తులు తరలివస్తారు. సంక్రాంతి నాడు జరిగే మల్లికార్జునస్వామి ఉత్సవాలకు కూడా కోహెడ, చిగురుమామిడి, అక్కన్నపేట మండలాలు, కరీంనగర్‌ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని సందర్శించుకుంటారు. సంక్రాంతి రోజు రాత్రి బోనాల ఉత్సవాలతో ఆలయ ప్రాగణంలో జాతర సందడి నెల కొంటుంది. మల్లన్న బోనాలు సమర్పించిన భక్తులు ఆ రాత్రి ఆలయం ఆవరణలోనే నిద్రించి తెల్లవారి జామున జరిగే అగ్ని గుండాలను తిలకిస్తారు. అగ్ని గుండాలను దాటి స్వామిపై తమ కున్న అచంచల భక్తిని చాటుతారు. ఈ అగ్నిగుండాలు దాటేందుకు హైదరాబాద్‌ నుంచి భక్తులు తరలివస్తారు. మూడు రోజులు నిర్వహించే మల్లికార్జున స్వామి ఉత్సవాలు అగ్ని గుండాలతో ముగిస్తాయి. పుణ్యక్షేత్రాలకు నిలయంగా ఉన్న పొట్లపల్లికి భక్తుల రాక ఏటా పెరుగుతూవస్తోంది.



మల్లికార్జున స్వామి

ఊరంత మద్యం, మాంసం బంద్‌

సంక్రాంతి పండగ రోజున ఊరంత మల్లన్న బోనాలు చేస్తారు. పట్నాలు వేస్తారు. దీంతో ఊరులో ఎక్కువ మంది ఉపవాస దీక్షలు చేపడతారు. ఆరోజు ఊరంత మద్య, మాంసాహారానికి దూరంగా ఉంటారు. తెలంగాణ రాష్ట్రంలో ఇదో ప్రత్యేకత. అత్తారింటికి వచ్చిన కొత్త అల్లుళ్లు కూడ వీటికి దూరంగా ఉంటారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు ఊరంత విందు చేసుకుంటారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ కోసం..

- రైతుల ఆత్మహత్యాయత్నం
- నర్సాపూర్‌ విద్యుత్‌ కార్యాలయంలో ఘటన
- ఏడీఈ నచ్చ చెప్పడంతో వెనుదిరిగిన రైతులు



ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరిస్తున్న రైతులు పోచయ్య, సత్తయ్యలు


నర్సాపూర్‌: ట్రాన్స్‌ఫార్మర్‌ సామర్థ్యం పెంచాలని కోరుతూ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి వేసారిన పలువురు రైతులు ఆత్మహత్యకు యత్నించారు. వివరాలిలా ఉన్నాయి. మెదక్‌ జిల్లా నర్సాపూర్‌ మండలంలోని చిన్నచింతకుంట గ్రామానికి చెందిన రైతులు బండపోచయ్య, మల్లయ్య, శేకులు, సత్తయ్య తదితరులు గురువారం మండల విద్యుత్‌ కార్యాలయానికి వచ్చారు. వచ్చేటప్పుడు పురుగుల మందు డబ్బా వెంట తెచ్చుకున్నారు. తమకు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్‌ సరఫరాలో హెచ్చుతగ్గులు రావడంతో పంటలు ఎండిపోతున్నాయని వారు వివరించారు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటుచేయాలని విద్యుత్‌ శాఖ అధికారులను నాలుగు నెలలు డీడీలు చెల్లించామన్నారు. వచ్చిన ప్రతీసారి ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు చేస్తామని చెబుతున్నారే తప్ప చర్యలు తీసుకోవడంలేదని వారు ఆరోపించారు. లోఓల్టేజీతో ఇబ్బందులు పడుతున్నామని, పెద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ ఇవ్వక పోతే మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుంటామని ఏఈ రాజ్‌కుమార్‌తో అంటే అలాగే చావండని అన్నాడని ఆరోపించారు. కాగా నెలల తరబడి తిరగలేక పురుగుల మందు డబ్బాతో వచ్చామని, ట్రాన్స్‌ఫార్మర్‌ ఇవ్వక పోతే తాము విద్యుత్‌ కార్యాలయంలోనే ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధపడి వచ్చామని రైతులు బండ పోచయ్య, మల్లయ్య, శేకులు, సత్తయ్య స్పష్టం చేశారు. ఏడీఈ భాస్కర్‌రెడ్డి అక్కడికి వచ్చి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు స్టాకు లేనందున ఏర్పాటుచేయడంలో ఆలస్యమైందని వారికి వివరించారు. ఉన్నతాధికారులతో మాట్లాడగా ట్రాన్స్‌ఫార్మర్‌ కేటాయించారని, త్వరలోనే ట్రాన్స్‌ఫార్మర్‌ బిగించే పనులు చేపడతామని ఏడీఈ రైతులకు నచ్చ చెప్పగా వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఏఈ రాజ్‌కుమార్‌ వివరణ

చిన్నచింతకుంట గ్రామంలోని బండపోచయ్యతో పాటు ఇతర రైతుల పంట పొలాల వద్ద కరెంటు సమస్య అంతగా లేదని ఏఈ రాజ్‌కుమార్‌ చెప్పారు. రైతులు ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ కన్న ఎక్కువ కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్‌ కావాలని డీడీలు చెల్లించారన్నారు. 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు స్టాకు లేనందున రైతులకు ఇవ్వలేక పోయామన్నారు. తాను ఎవరితో చావాలని అనలేదని ఏఈ వివరించారు. ఏడీఈ భాస్కర్‌రెడ్డి ఉన్నతాధికారులతో మాట్లాడి 100 కేవీ మంజూరు చేయించారని, శుక్రవారం బిగించే పనులు చేపడుతామన్నారు.

వాటర్‌ ట్యాంకు ఎక్కి వ్యక్తి హల్‌చల్‌

- మతిస్థిమితం లేకపోవడంతో పుట్టింటికి వెళ్లిన భార్య
- ఆత్మహత్య చేసుకుంటున్నానని కేకలు
- కాపాడిన పోలీసులు



వాటర్‌ట్యాంకు ఎక్కిన రవీందర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్‌): వాటర్‌ ట్యాంకు ఎక్కి ఓ వ్యక్తి తన సమస్యను పరిష్కరించకుంటే కిందకు దూకుతానని హంగామా చేసిన సంఘటన చేగుంటలోని బుడగ జంగాల కాలనీలో గురువారం చోటు చేసుకుంది. నిజామాబాద్‌ జిల్లా మోర్తాడ్‌ మండలం తిమ్మాపూర్‌ గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి కొద్ది కాలంగా విచిత్రంగా ప్రవర్తిస్తుండటంతో భార్య అపర్ణ పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో నిత్యం మద్యం సేవిస్తూ మతిస్థిమితం కోల్పోయినట్లు వ్యవహరిస్తున్నాడు. గురువారం చేగుంట బుడగజంగాల కాలనీ ట్యాంకుపైకి ఎక్కిన రవీందర్‌రెడ్డి తనను కొంతమంది చంపడానికి ప్రయత్నిస్తున్నారని, భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని దీంతో ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చానని కేకలు వేశాడు. తనను దింపడానికి వస్తే ట్యాంకుపై నుంచి దూకుతానని బెదిరించాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని, ట్యాంకు దిగితే సమస్య పరిష్కరిస్తామని నచ్చజెప్పారు. రవీందర్‌రెడ్డి గురించి తిమ్మాపూర్‌ గ్రామస్తులకు సమాచారం అందించారు. యోగా కోచ్‌ కరణం గణేష్‌ ట్యాంకు వద్దకు వచ్చి తిమ్మాపూర్‌ గ్రామస్తులు రవీందర్‌ బంధువులతో ఫోన్‌లో మాట్లాడించి ట్యాంకుపైనుండి దింపారు. రవీందర్‌రెడ్డి డిప్రెషన్‌లో ఉన్నట్లు గుర్తించిన ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్‌ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్‌ నిర్వహించారు.

వెస్లీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ధర్నా

కళాశాలను సీజ్‌ చేసిన అధికారులు



కళాశాలను సీజ్‌ చేస్తున్న డీఐఈఓ సత్యనారాయణ

మెదక్‌ మున్సిపాలిటీ: విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా మెదక్‌లోని వెస్లీ జూనియర్‌ కళాశాల వేధింపులకు పాల్పడుతోందని, ఫీజులు చెల్లించాలని డిమాండ్‌ చేస్తున్నారని ఏబీవీపీ ఆరోపించింది. గురువారం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా మెదక్‌ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌ శ్రీనివాస్‌ గౌడ్‌ మాట్లాడుతూ వెస్లీ జూనియర్‌ కళాశాలలో కనీస మౌలిక వసతులు లేవని, సరిపడా లెక్చరర్లు లేకుండానే కళాశాల నిర్వహిస్తున్నారన్నారు. అడ్మిషన్ల సమయంలో ఉచిత బోధన అని చెప్పి కోర్సు పూర్తి చేసిన తర్వాత ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ విద్యార్థులతో దురుసుగా ప్రవర్తించిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. అలాగే విద్యార్థినులు సర్టిఫికెట్స్‌ కావాలని అడిగితే ప్రిన్సిపాల్‌ చంద్రపాల్‌ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. కళాశాలకు వచ్చిన మెదక్‌ డీఐఈఓకు వినతిపత్రం అందజేశారు. మౌలిక వసతులు లేని కళాశాల గుర్తింపు రద్దుచేసి వెంటనే సీజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. దీనిపై స్పందించిన డీఐఈఓ కళాశాలను సీజ్‌ చేయడంతోపాటు విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలకు తరలించారు. ఇలాంటి ఘటనలు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్నాయని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులందరికీ సర్టిఫికెట్స్‌ ఇచ్చారు. ధర్నాలో మెదక్‌ జిల్లా కన్వీనర్‌ శశికాంత్‌ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాను, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెస్లీ కళాశాల సీజ్‌

మెదక్‌ పట్టణంలోని వెస్లీ జూనియర్‌ కళాశాలను డీఐఈఓ సత్యనారాయణ గురువారం ఆకస్మీకంగా తనిఖీ చేశారు. కనీస వసతులు లేకుండా నడుపుతున్నందున వెంటనే కళాశాలను సీజ్‌ చేశారు. విద్యార్థులను ప్రభుత్వ జూనియర్‌ కళాశాలకు తరలించారు. కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ఇంటర్‌ బోర్డుకు సిఫారస్‌ చేసినట్లు డీఐఈఓ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మెదక్‌ రూరల్‌: విద్యుత్‌ తీగలు, స్టాటర్‌ బాక్స్‌లు, దొంగిలిస్తున్నాడని ఆరోపిస్తూ రైతులు చేసిన దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మెదక్‌ మండల పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాపన్నపేట మండలం జయపురం గ్రామానికి చెందిన కుమార్‌(35) కూలీ పనులు చేస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి మెదక్‌ మండలం పేరూర్‌ శివారు మంజీర పరీవాహన ప్రాంత పొలాల్లోని విద్యుత్‌ తీగలను దొంగిలించి, మంటల్లో కాలుస్తుండగా రైతులు పట్టుకొని కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని తీవ్ర గాయాలతో ఉన్న కుమార్‌ను మెదక్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య శోభ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఆదర్శ విద్యార్థులు



విద్యార్థులతో సర్పంచ్‌, ఎంపీటీసీ, ఉపాధ్యాయులు

దుబ్బాక: జాతీయ స్థాయి ఫ్లోర్‌ బాల్‌ క్రీడా పోటీలకు దౌల్తాబాద్‌ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్‌ యజ్ఞశ్రీ తెలిపారు. ఇటీవల చేగుంటలో రాష్ట్రస్థాయి ఫ్లోర్‌ బాల్‌ క్రీడలో సిద్దిపేట జిల్లా తరుపున పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబర్చారన్నారు. సాయికిరణ్‌ ,రోహిత్‌, నరేందర్‌, బాల్‌రాజ్‌, అనిల్‌, రాకేష్‌, అంజి, వేదంత్‌, యోగేందర్‌, కౌశిక్‌ ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌ రాష్ట్రం గ్వాలియర్‌ ఐటీఎం యూనివర్సిటీలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో గురువారం సర్పంచ్‌ ముత్యం గారి యాదగిరి, ఎంపీటీసీ ఆది వనిత వేణుగోపాల్‌ వారికి క్రీడా దుస్తులు అందించారు. మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న పీఈటీ సురేశ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్‌, అల్తాఫ్‌ తదితరులు పాల్గొన్నారు.


భూ తగాదాల్లో బైక్‌ కాల్చివేత



కాలిపోయిన బైక్‌ను పరిశీలిస్తున్న ఏఎస్‌ఐ విఠల్‌


శివ్వంపేట(నర్సాపూర్‌): భూ తగాదాల నేపథ్యంలో ఇంటి ముందు పార్క్‌ చేసిన బైక్‌ను తగులబెట్టారు. ఈ సంఘటన మండల పరిధి గంగాయాపల్లి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ విఠల్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లచ్చన్నగారి చంద్రం తన బైక్‌ను రోజుమాదిరిగా బుధవారం తన ఇంటి ముందు పార్క్‌ చేశాడు. బైక్‌ను చంద్రం అన్న కుమారుడు స్వదేశ్‌ తగులబెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అన్నదమ్ముల మధ్య భూ తగాదాలతో సంఘటన చోటుచేసుకుందన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృత్యువాత



యాదగిరి (ఫైల్‌)

మనోహరాబాద్‌(తూప్రాన్‌): బైక్‌పై కంపెనీకి వెళ్తున్న యువకుడిని లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మనోహరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా బిక్నూర్‌ మండలం పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన చిన్నోల్ల నర్సింలు, లలిత దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. వీరిలో పెద్ద కుమారుడు యాదగిరి (26) ఉపాధి కోసం మనోహరాబాద్‌ మండలం దండుపల్లి వచ్చాడు. ఇద్దరు మిత్రులతో కలిసి అద్దెకుంటూ కండ్లకోయ వద్ద ట్రాన్స్‌కోలో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం వేకువ జామున బైక్‌పై కండ్లకోయకు వెళ్తుండగా మార్గమధ్యలో జాతీయ రహదారి-44పై కాళ్ళకల్‌ వద్ద హైదరాబాద్‌ వెళ్తున్న హరియాణకు చెందిన కంటెయినర్‌ లారీ అదుపుతప్పి వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో యాదగిరి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా మృతుడికి రెండేళ్ల క్రితం నాగలక్ష్మీతో వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర కూతురు ఉంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని తూప్రాన్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాళ్ళకల్‌ వద్ద రోడ్డుపై ఆటోలు ఇష్టారీతిన పార్కింగ్‌ చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మాధవి మృతదేహం

కొండపాక(గజ్వేల్‌): రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి చెందింది. ఈసంఘటన కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో గురువారం చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగదేవ్‌పూర్‌ మండలం మునిగడప గ్రామానికి చెందిన వడ్డెర భిక్షపతి కూతురు మాధవి కొండపాకలోని బాలికల హైస్కూల్లో గతేడాది టెన్త్‌ పూర్తి చేసింది. మెమో తీసుకెళ్లేందుకు మేడ్చల్‌ నుంచి అమీర్‌తో కలిసి బైక్‌పై వస్తున్నారు. తిమ్మారెడ్డిపల్లి శివారులో బైక్‌ అదుపు తప్పి రోడ్డు హద్దు రాయికి బలంగా ఢీకొట్టడంతో మాధవీ, అమీర్‌ ఎగిరిపడ్డారు. దీంతో మాధవికి తీవ్రంగా, అమీర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మాధవి మృతి చెందింది. మాధవి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల ఏడుగురి ఆత్మహత్య

వేర్వేరు చోట్ల వ్యక్తిగత కారణాలతో ఏడుగురు ఆత్మహత్య చేసుకున్నారు. వారిలో నలుగురు మహిళలు ఉండటం విచారకరం. జీవితంపై విరక్తి చెంది నలుగురు బలవన్మరణం పొందారు. అప్పుల బాధతో మరో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



జి.సుశీల (ఫైల్‌)

పెద్దశంకరంపేట(మెదక్‌): జీవితంపై విరక్తి చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. పేట ఏఎస్‌ఐ అశోక్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌ మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన జి.సుశీల(50) భర్తకు మతిస్థిమితం లేకపోవడంతో ఏ పనిచేయడం లేదు. ఈ విషయంపై గత కొన్నేళ్లుగా ఆమె ఆందోళన చెందుతోంది. ఇటీవల తన పుట్టిల్లు పెద్దశంకరంపేట మండలం సంగారెడ్డిపేట వచ్చింది. మంగళవారం తన గ్రామానికి వెళ్తున్నట్లు తన తమ్ముడికి చెప్పి ఇంటి నుంచి అచ్చంపేటకు బయలుదేరింది. పేటకు వచ్చిన సుశీల ఓ దుకాణంలో పురుగులమందు కొని పేటలోని టీటీడి కల్యాణమండపం వద్ద ఖాళీ స్థలంలో తాగింది. గురువారం ఉదయం స్థానికులు మహిళ మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందించారు. సుశీల ఇంటికి వెళ్లకపోవడంతో ఆమె తమ్ముడు సాయిలు పోలీస్‌ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని సుశీలదిగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైలుకింద పడి..

చేగుంట(తూప్రాన్‌): తల్లితో గొడవపడి క్షణికావేశంలో ఓ మహిళ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండల కేంద్రమైన చేగుంట రైల్వేగేటు సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, రైల్వే ఎస్‌ఐ తావునాయక్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డికి చెందిన పెండ్యాల భాగ్య(30) చిన్నకోడూరు మండలం రామంచకు చెందిన రాజుతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. భాగ్యను భర్త వదిలి వెళ్లిపోగా తల్లి నర్సమ్మతో కలిసి చేగుంటలో ఉంటూ కూలీ పనులు చేస్తోంది. బుధవారం రాత్రి నరసమ్మ కూతురు భాగ్యతో గొడవపడ్డారు. దీంతో మనస్తాపం చెందిన భాగ్య ఇంటి నుంచి వెళ్లి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి రైల్వే ఆస్పత్రికి తరలించారు. మృతురాలు భాగ్యకు కూతుర్లు అమృత, అర్చన, కుమారుడు ఆకాశ్‌ ఉన్నారు.

భార్యాభర్తలు గొడవపడి..

భార్యాభర్తలు గొడవపడి భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నడిమితండా గ్రామ పంచాయతీ పరిధి సాజు తండాలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సాజుతండాకు చెందిన మూడ్‌స్వామి, శారద దంపతులు బుధవారం రాత్రి గొడవ పడ్డారు. దీంతో గురువారం ఉదయం శారద (30) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు తండాకు చేరుకొని కేసు విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్‌ తెలిపారు.

దుబ్బాక: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రాయపోల్‌ మండలం మంతూర్‌ గ్రామంలో జరిగింది. గురువారం రాయపోల్‌ ఎస్‌ఐ షేక్‌ మహబూబ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మంతూర్‌ గ్రామానికి చెందిన పట్నం మల్లయ్య (72) వ్యవసాయం చేస్తున్నాడు. చిన్న కొడుకు 3 సంవత్సరాల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి పిల్లలను మల్లయ్య పోషిస్తున్నాడు. పిల్లల పోషణ, పంటల సాగుకు చేసిన అప్పులు ఎక్కువయ్యాయి. అప్పులపై భార్యాభర్తలు గొడవ పడ్డారు. దీంతో మల్లయ్య బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి శవ పరీక్ష నిమిత్తం మృతుదేహాన్ని గజ్వేల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు పట్నం నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మల్లయ్య (ఫైల్‌)

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చిలప్‌చెడ్‌ మండలం చండూర్‌ శివారులో గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఏఎస్‌ఐ మిస్బావుద్దీన్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చండూర్‌ గ్రామశివారులోని చింతచెట్టుకు మృతదేహం వేలాడుతోందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం చండూర్‌ గ్రామానికి చెందిన దుబ్బల మహేందర్‌ (28)గా గుర్తించారు. మృతుడి భార్య స్వప్న, తల్లి సత్తమ్మ కూడా ధ్రువీకరించారు. అప్పులు ఎక్కువై మహేందర్‌ ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మహేందర్‌ పదిరోజులుగా కనబడకపోయినప్పటికీ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

కూతురుతో చెరువులో దూకి తల్లి ఆత్మహత్య



పద్మ, శివానీ మృతదేహాలు

సంగారెడ్డి మున్సిపాలిటీ: జీవితంపై విరక్తి చెంది కూతురుతో చెరువులో దూకి తల్లి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన చౌటకూర్‌ మండలం శివంపేట గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పుల్కల్‌ ఎస్‌ఐ కుమార గణేశ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శివంపేట గ్రామానికి చెందిన పుల్లపు పద్మ(32)కు పాపన్నపేటకు చెందిన పుల్లపు మల్లేశ్‌తో వివాహం జరిగింది. పదేళ్ల క్రితం మల్లేశ్‌ చనిపోయాడు. అప్పటి నుంచి పుట్టిల్లు శివంపేటలో ఉంటోంది. ఈ క్రమంలో పటాన్‌చేరు మండలం చిట్‌కుల గ్రామానికి చెందిన తన అక్క భర్త తమ్ముడు పల్లపు మల్లేశ్‌తో సహజీవం చేస్తోంది. మల్లేశ్‌కు పెళ్లి కుదరడంతో పద్మను వదిలేసి పెళ్లి చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఇందుకు అంగీకరించని పద్మ పెళ్లి చేసుకోవద్దని తన దగ్గరే ఉండాలని పట్టు పట్టింది. అయినా మల్లేశ్‌ వినకుండా తాను పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో తీవ్ర మనస్థాపానికి గురైన పద్మ గురువారం కూతురు శివానీ (5)తో కలిసి గ్రామంలోని చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. పద్మ తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించిన్నట్లు వెల్లడించారు.

■ గేమింగ్

దుష్టశక్తిని శక్తిహీనం చేయండి




త్వరలో విడుదల కాబోతున్న టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్ ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్. 'ఫైర్' సిరీస్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ఎన్నో సంవత్సరాల తరువాత ఒక దుష్టశక్తి తిరిగి వస్తే? భయపడితే ప్రయోజనం లేదు, భయపెడితేనే ఫలితం దక్కుతుంది. ఈ ఆటలో ఉంగరాలే ప్రధాన ఆయుధాలు. వివిధ రకాల దాడులకు ఉపకరించే మహిమాన్విత ఉంగరాలు ఇవి. ఈ గేమ్‌కు సంబంధించిన మార్పు ఏమిటంటే ప్లేయర్స్ తమ బలగాలను డైరెక్ట్‌గా కంట్రోల్ చేయవచ్చు. 2019లో వచ్చిన 'ఫైర్ ఎంబ్లమ్: త్రీ హౌజెస్' పెద్ద సక్సెస్ అయింది. దీంతో తాజా ఆటపై అంచనాలు పెరిగాయి. విజువల్ నావెల్ స్టోరీ టెల్లింగ్‌తో ప్లేయర్స్‌ను పలకరించనున్న 'ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్' ఆ అంచనాలను అందుకోవాలని ఆశిద్దాం.

మోడ్: సింగిల్–ప్లేయర్ వీడియో గేమ్ **జానర్స్:** టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్

■ టెక్... టాక్

ఇన్‌స్టాలో ఇలా...



ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ నుంచి డిలీట్ చేసిన కంటెంట్‌ను రీస్టోర్ చేసుకోవడానికి...

* ఇన్‌స్టా ఓపెన్ చేసిన తరువాత ప్రొఫైల్‌పై ట్యాప్ చేయాలి.
* టాప్‌రైట్‌లోని 'మోర్ ఆప్షన్స్' ట్యాప్ చేయాలి.
* యాక్టివిటీ కంట్రోల్స్–ట్యాప్
* రీసెంట్ డిలీటెడ్–ట్యాప్
* టాప్‌లోని టైప్ ఆఫ్ కంటెంట్ (రీస్టోర్–ప్రొఫైల్ పోస్ట్స్,రీల్స్, వీడియోస్, స్టోరీస్) సెలెక్ట్ చేసుకోవాలి
* రీస్టోర్ చేయాలనుకున్నదానిపై ట్యాప్ చేయాలి.
* టాప్ రైట్‌లోని మోర్ ఆప్షన్–ట్యాప్
* రీస్టోర్ టు ప్రొఫైల్ లేదా రీస్టోర్ టు రీస్టోర్ కంటెంట్ ట్యాప్ చేయాలి.

వాట్సాప్‌లో కెప్ట్ మెసేజ్ ఫీచర్



ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ 'కెప్ట్ మెసేజ్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. దీనితో డిజపీయరింగ్ మెసేజ్‌లను సేవ్ చేయవచ్చు. చాట్‌లకు సంబంధించి మరింత కంట్రోల్‌కు యూజర్‌లకు ఉపకరించే ఫీచర్ ఇది. 2021లో స్నాప్‌చాట్... మొదలైన వాటి స్ఫూర్తితో వాట్సాప్ 'డిజప్పియరింగ్ మెసేజ్' ఫీచర్‌ను ప్రవేశ పెట్టింది. ఎవరికైనా మెసేజ్ పంపినప్పుడు నిర్ణీతమైన కాలవ్యవధి తరువాత మెసేజ్ దానికదే డిలీట్ అయిపోతుంది. మళ్లీ దాన్ని చూడడం కుదరదు. అయితే 'కెప్ట్ మెసేజ్' టూల్ డిజప్పియరింగ్ చాట్‌లో కూడా మెసేజ్‌లను ప్రిజర్వ్ చేస్తుంది.

■ సక్సెస్ స్టోరీ

క్లిక్‌కింగ్

పదమూడు సంవత్సరాల వయసులోనే కెమెరాతో స్నేహం మొదలుపెట్టిన ప్రణయ్‌కి, ఇప్పుడు ఆ కెమెరానే ప్రాణం. అరణ్యానికి సంబంధించిన అద్భుతదృశ్యాలను అమితంగా ఇష్టపడే ప్రణయ్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు. ఇంకా ఎన్నో అద్భుతాలు సాధించడానికి ఉత్సాహంగా ఉన్నాడు.....


ప్రణయ్ పటేల్

పదమూడు సంవత్సరాల వయసులో కెమెరాతో అనుబంధం పెంచుకున్నాడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ప్రణయ్ పటేల్. అది ఆ వయసుకు మాత్రమే పరిమితమైన ఉత్సాహమై ఉంటే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రణయ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేవాడు కాదు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు. ఈ చిత్రాలు జాతీయ,అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి. అడవిలో ఫొటోగ్రఫీ అనేది అంతా ఈజీ కాదు.

'మేము రెడీ. ఇక మీరు ఫొటో తీసుకోవచ్చు' అన్నట్లుగా ఉండదు అక్కడ. ఏ క్షణంలో ఏ అద్భుతం ఆవిష్కారం అవుతుందో తెలియదు. ఒళ్లంతా కెమెరా కన్నులై ఉండాలి. అడవి నాడి తెలిసిన ప్రణయ్‌కి ఈ విషయం తెలియనిదేమీ కాదు. అందుకే అడవిలోని అద్భుతదృశ్యాలను సమర్థవంతంగా పట్టుకోగలిగాడు.

'లొకేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే బ్యాక్‌ప్యాక్ ఓపెన్ చేసి కెమెరా సెట్ చేసుకోవాలి. బోర్ కొట్టవచ్చు. అలసటగా అనిపించవచ్చు. అయితే మన లక్ష్యం...అద్భుత దృశ్యం అనే విషయాన్ని మరవకూడదు. ఓపికతో కూడిన నిరీక్షణ నన్ను ఎప్పుడూ నిరాశ పరచలేదు' అంటాడు ప్రణయ్.

> దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు ప్రణయ్. ఈ చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి.

ప్రణయ్ ఫొటోలతో రూపుదిద్దుకున్న 'ది వండర్‌ఫుల్ వైల్డ్‌లైఫ్ ఆఫ్ గుజరాత్' 'ది బేర్స్ ఆఫ్ కమ్‌చట్‌క-రష్యా' 'ది వైల్డ్ ఎర్త్ ఆఫ్ ఆఫ్రికా'... మొదలైన క్యాలెండర్‌లకు ఎంతో పేరు వచ్చింది. గుజరాత్ టూరిజం కార్పొరేషన్ అధికారిక ఫొటోగ్రాఫర్‌గా చిన్న వయసులోనే నియమించబడ్డాడు.

'ఫొటోగ్రాఫర్‌కు దృశ్యజ్ఞానమే కాదు శబ్దజ్ఞానం కూడా ఉండాలి' అంటున్న ప్రణయ్ శబ్దాల ద్వారా కూడా దృశ్యాలను ఊహించగలడు. వాటిని అందంగా ఛాయాచిత్రాలలోకి తీసుకురాగలడు.

తన వెబ్‌సైట్ ద్వారా ఎంతో మంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు స్ఫూర్తిని, ఉత్సాహాన్ని ఇస్తున్న ప్రణయ్ అమెరికాతో సహా ఎన్నో దేశాల్లో జరిగిన ఫొటోఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నాడు.

'వర్తమానం నుంచే కాదు గతం నుంచి కూడా ఎన్నో అద్భుత విషయాలను నేర్చుకోవచ్చు' అంటున్న ప్రణయ్ అలనాటి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలలోని అద్భుతాలను ఆసక్తిగా విశ్లేషిస్తుంటాడు.

'ప్రతి ఫొటో ఒక కొత్త విషయాన్ని మనకు పరిచయం చేస్తుంది' అంటాడు ప్రణయ్.

స్కూల్‌బ్యాగ్ మోసుకెళ్లాల్సిన వయసులో కెమెరా బ్యాగు మోసుకెళుతున్న ప్రణయ్‌కి వెక్కిరింపులు ఎదురయ్యాయి. 'ఇక నీకు చదువు ఏం వస్తుంది!' అని ముఖం మీదే అన్నవాళ్లు కూడా ఉన్నారు.

అయితే ఆ మాటలు విని తాను ఎప్పుడూ బాధపడలేదు. వెనక్కి తగ్గలేదు. కెమెరాతో స్నేహం వీడలేదు. దేశవిదేశాలలో ప్రణయ్ చేసిన ఫొటోగ్రఫీ టూర్‌లు వంద దాటాయి.

'ప్రతి టూర్‌కు సంబంధించిన అనుభవాలను ఒక పుస్తకంగా రాసుకోవచ్చు' అని మురిసిపోతుంటాడు ప్రణయ్.

'కెమెరా పట్టుకోగానే అద్భుతాలు చోటుచేసుకోవు. పర్‌ఫెక్ట్ షాట్ కోసం రోజులే కాదు సంవత్సరం పాటు ఎదురుచూసిన సందర్భాలు కూడా ఉన్నాయి' అంటాడు ప్రణయ్. ఫొటోగ్రఫీ గురించి ఓనమాలు తెలియని వారే కాదు, ఆ విద్యలో కొమ్ములు తిరిగిన ఫొటోగ్రాఫర్‌లు కూడా ప్రణయ్‌ని ప్రశంసలతో ముంచెత్తున్నారు.

25 సంవత్సరాల ప్రణయ్ పటేల్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

■ పెద్ద పండగ

పండగపూట పల్లెటూర్



* మీది పల్లెటూరు అయితే ఫరవాలేదు, నగరవాసులు అయితే మాత్రం ఈ మూడు రోజుల పండగలో ఒకరోజు 'పల్లె' టూర్'కు కేటాయించండి. ఎందుకంటే ఇది రైతుల పండగ. పంటల పండగ. పచ్చదనాల పండగ. పొలాల దగ్గరికి వెళ్లి ఆ గాలిని ఆస్వాదించండి. రైతులతో మాట్లాడితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.
* పండగపూట కాస్త కొత్తగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? దీని కోసం పండగరోజు పంచె,కండువా ధరించండి. ఎంత బాగున్నారో కదా!
* గాలిపటాలు ఎగిరేసే ముందు పక్షుల గురించి ఒక్కసారి ఆలోచించండి.

■ ఇంగ్లీష్ ఇడియమ్స్

కింగ్ ఆఫ్ ది హిల్



ఒక వ్యక్తి సమర్థతకు సంబంధించి ఏకాభిప్రాయంతో చెప్పే మాట....కింగ్ ఆఫ్ ది హిల్. ఫలాన ఆటలో ఫలానా వ్యక్తి ఛాంపియన్, ఫలానా రంగంలో ఫలానా వ్యక్తికి తిరుగులేని సామర్థ్యం ఉంది....ఇలాంటి సందర్భాల్లో ఉపయోగిస్తారు. ఇంగ్లాండ్‌లోని పిల్లల ఆటల్లో నుంచి పుట్టిన మాట ఇది. ఆటలో భాగంగా పిల్లవాడు ఒక ఎత్తయిన చోట కూర్చొని, తనను తాను రాజుగా ప్రకటించుకొని 'ఐయామ్ ది కింగ్ ఆఫ్ కాజిల్ అండ్ యూ ఆర్ డర్టీ' అని పాట అందుకుంటాడు. ఇతడిని కిందికి దించడానికి మిగతా పిల్లలు ప్రయత్నిస్తుంటారు.

■ గ్యాడ్జెట్ బజార్

డిజో స్మార్ట్ వాచ్



డిజో వాచ్ డి ప్రో, వాచ్ డి అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను మన దేశంలో విడుదల చేసింది. వీటికి సంబంధించిన కొన్ని వివరాలు..

డి ప్రో
స్క్రీన్: 1.85 అంగుళాలు రిఫ్రెష్ రేట్: 60 హెచ్‌జడ్ పవర్: డిజో డీఐ చిప్
మోడ్స్: 110 స్పోర్ట్స్ మోడ్స్
కలర్ ఆప్షన్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, లైటెనింగ్ బ్లూ ధర: ₹ 2,699

డి అల్ట్రా
స్క్రీన్: 1.78 అంగుళాలు బ్యాటరీ: 270 ఎంఏహెచ్ రిజల్యూషన్: 368×448 పిక్సెల్స్ బ్యాటరీ: 270 ఎంఏహెచ్ మోడ్స్: 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్ (ఇండోర్–ఔట్‌డోర్) కలర్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, ఓషన్ బ్లూ.

లెనోవా ట్యాబ్ పీ11 ప్రో జెన్2



రిజల్యూషన్: 1536×2560 పిక్సెల్స్ బ్యాటరీ: 8000 ఎంఏహెచ్
ఓఎస్/సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 12
● ఫింగర్‌ప్రింట్ సెన్సర్
మెమోరీ: 128 జీబి 4జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్

సినిమా

ప్రేమికుల దినోత్సవానికి టైటానిక్


● కేట్ విన్స్‌లెట్, లియోనార్డో

సినిమా లవర్స్‌కి.. అందులోనూ ప్రేమకథా చిత్రాల ప్రేమికులకు ఈ ప్రేమికుల దినోత్సవానికి సిల్వర్ స్క్రీన్‌పై 'టైటానిక్' ప్రత్యక్షం కానుంది. టైటానిక్ ఓడలో పరిచయం అయి, ప్రేమికులుగా దగ్గరయ్యే జాక్, రోజ్‌లు చివరికి ఓడ ప్రమాదంలో దూరమయ్యే ఈ విషాదభరిత ప్రేమకథ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. ప్రేమికులుగా లియోనార్డో డికాప్రియో, కేట్ విన్స్‌లెట్‌ల కెమిస్ట్రీని అంత సులువుగా ఎవరూ మరచిపోలేరు. జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన ఈ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీ విడుదలై 25 ఏళ్లయింది. ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఈ చిత్రాన్ని హై క్వాలిటీతో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పైకి తీసుకు రావాలనుకుంటున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించి పోస్టర్‌ని, ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన ట్వంటీయత్ సెంచురీ ఫాక్స్. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 4కే ప్రింట్‌తో త్రీడీ వెర్షన్‌లో ఈ లవ్‌స్టోరీ కొత్త హంగులతో రావడానికి సిద్ధమవుతోంది. ఇక 1997 నవంబర్‌లో విడుదలైన 'టైటానిక్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా రూ. 13 వేల కోట్లకు పైగా కలెక్ట్ చేసి, రికార్డు సృష్టించింది. 2010లో జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' విడుదలయ్యే వరకూ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం రికార్డ్ 'టైటానిక్'దే. కామెరూన్ తన సినిమా రికార్డ్‌ని తానే బద్దలు కొట్టడం విశేషం. ఇక ఆస్కార్ అవార్డ్స్‌లో 14 నామినేషన్లు దక్కించుకుని, 11 అవార్డులను సొంతం చేసుకున్న ఘనత కూడా 'టైటానిక్'కి ఉంది. ప్రేక్షకుల ఆదరణతో పాటు ఇలా పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ చిత్రం త్రీడీ వెర్షన్‌ని 2012లో విడుదల చేశారు. ఇప్పుడు మరింత క్వాలిటీతో 'టైటానిక్' రానుంది.

ఇన్నాళ్లకు మళ్లీ కన్నీళ్లు వచ్చాయి

– 'దిల్' రాజు


● జయసుధ, వంశీ పైడిపల్లి, 'దిల్' రాజు, శ్రీకాంత్

''వారిసు' చిత్రంపై తమిళ ప్రేక్షకులు చూపిన స్పందనకి వంశీ పైడిపల్లి, తమన్ ఏడ్చారు. 'బొమ్మరిల్లు' సినిమా చూస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో నేను కూడా ఏడ్చాను.. మళ్లీ ఇన్నాళ్లకు 'వారిసు' చూస్తున్నపుడు కన్నీళ్లు వచ్చాయి. మా నమ్మకం నిజం కావడంతో వచ్చిన ఆనందభాష్పాలు అవి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'వారిసు' (తమిళ్), 'వారసుడు' (తెలుగు). 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళ్‌లో విడుదలైంది. తెలుగులో 14న 'వారసుడు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లడుతూ– ''చెన్నైలో 'వారిసు' ఆడుతున్న థియేటర్‌కి వెళ్లాను.. క్లైమాక్స్ పూర్తయ్యాక వంశీని అభిమానంతో హత్తుకున్నాను. ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొట్టడంతో మేం పడ్డ కష్టాలు మర్చిపోయాం'' అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ– ''ఒక మంచి కథని చెబితే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'వారిసు' మరోసారి నిరూపించింది. సినిమా అయిపోయిన తర్వాత ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'వెయ్యి కోట్లు పెట్టినా రాని అనుభూతి ఇది' అని అభినందించారు'' అన్నారు. ''తమిళంలోలా తెలుగులోనూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది'' అన్నారు నటి జయసుధ.

అదరగొట్టావ్ అబ్బాయ్ అన్నారు

– దేవిశ్రీ ప్రసాద్



''వాల్తేరు వీరయ్య'లో 'పూనకాలు లోడింగ్..' పాటలో బూరలాంటి వాయిద్యం ఉపయోగించి ఆ ట్యూన్‌ని కంపోజ్ చేశాను. అది చిరంజీవి గారికి నచ్చడంతో 'అదర గొట్టావ్ అబ్బాయ్' అన్నారు. నేను కంపోజ్ చేసిన ట్యూన్ ఒక ఎత్తు అయితే ఆయన డ్యాన్స్‌తో పాటని మరో స్థాయికి తీసుకెళ్లారు" అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా హీరో రవితేజ కీలక పాత్రలో బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.

* చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' చిత్రాలు నిర్మించింది మా మైత్రీ మూవీస్ నిర్మాతలే (నవీన్ యెర్నేని, వై. రవిశంకర్). రెండు సినిమాలూ మావే కావడం, సంక్రాంతికి విడుదలవడం చాలా గర్వంగా ఉంది. సంగీతం విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ సినిమాకైనా కథ ప్రకారమే మ్యూజిక్ చేస్తాం.. రెండు సినిమాలూ అద్భుతంగా ఆడాలి.
* బాబీతో నాకు చాలా అనుబంధం ఉంది. 'వాల్తేరు వీరయ్య'లో అన్ని పాటలూ హిట్ కావడానికి కారణం బాబీ కథ, ఆయన నాపై పెట్టుకున్న నమ్మకం. అన్నిటికీ మించి చిరంజీవిగారు మా ఇద్దరిపై పెట్టుకున్న నమ్మకం. చిరంజీవిగారితో సినిమా చేయాలనే బాబీ కల ఈ చిత్రంతో నెరవేరడం ఆనందంగా ఉంది. ఈ సినిమా చూసి చిరంజీవిగారితో 'నవ్విస్తూ ఏడిపించారు.. ఏడిపిస్తూ నవ్వించారు' అని అన్నాను. ఆయన 'ఎంత బాగా చెప్పావ్ మై బాయ్' అన్నారు.
* ఈ సినిమాలో రవితేజ, చిరంజీవిగారి సీన్స్‌కి క్లాప్స్ మామూలుగా ఉండవు. కంట తడితో, నవ్వుతూ క్లాప్స్ కొట్టే సీన్స్ చాలా ఉంటాయి. బాస్‌ని (చిరంజీవి) మనం ఎలా అయితే చూస్తూ పెరిగామో.. ఆ ఎలిమెంట్స్‌తో పాటు కొన్ని కొత్త ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. కామెడీ, డ్యాన్స్, ఫైట్స్.. అన్నీ కుమ్మేశారు. బాస్‌ని చాలా రోజుల తర్వాత పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌లో చూస్తున్నాం.. ఎక్కడా తగ్గకూడ దని ప్రతి పాట విషయంలో జాగ్రత్తలు తీసుకున్నా.
* ప్రతి సినిమా సవాల్‌గానే ఉంటుంది. కానీ, ఒత్తిడిగా భావించకుండా సరదాగా చేస్తాను. నేను బాస్‌ని చూస్తూ పెరిగాను.. ఆయన్ని చూడగానే ఒక ఎనర్జీ వచ్చేస్తుంది. ఇందులో 'నువ్వు శ్రీదేవి..' పాటకి ఆయన స్క్రీన్‌పై ఎలా చేస్తారో ముందే ఊహించి, కంపోజ్ చేసి బాబీకి చూపించా.. అలాగే 'పూనకాలు లోడింగ్..' పాటలో చిరంజీవి, రవితేజగార్లు కనిపిస్తే ఎంత సందడిగా ఉంటుందో ఆ ఎనర్జీ అంతా పాటలో ఇచ్చేశాం.

ఆ సన్నివేశాలు కంటతడి పెట్టిస్తున్నాయి

– బాలకృష్ణ


● రవిశంకర్, గోపీచంద్, బాలకృష్ణ, తమన్, నవీన్

''సంక్రాంతికి విందు భోజనంలాంటి సినిమా 'వీరసింహారెడ్డి'. ప్రేక్షకులు, ఫ్యాన్స్.. ఇలా అందరి నుండి అద్భుతమైన ఆదరణ వస్తోంది'' అన్నారు బాలకృష్ణ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వీర మాస్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ– ''అఖండ'లాంటి హిట్ తర్వాత అలాంటి మరో సినిమాని ప్రేక్షకులు ఆశిస్తారు. అందుకు తగ్గట్టే నా అభిమాని అయిన గోపీచంద్ 'వీరసింహారెడ్డి'ని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రంలో నాకు–వరలక్ష్మికి మధ్య వచ్చే అన్నా చెల్లెలి సన్నివేశాలు మహిళలనే కాదు మగవాళ్లనూ కంటతడి పెట్టిస్తున్నాయి'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బ్లాక్ బస్టర్'' అన్నారు గోపీచంద్. ''మా సినిమా తొలి రోజే 50 కోట్ల గ్రాస్ దాటుతోంది. ఇది పెద్ద రికార్డ్. బాలకృష్ణగారి మైలురాయి చిత్రానికి మేం నిర్మాతలు కావడం హ్యాపీ'' అన్నారు నిర్మాతలు.

క్రైమ్.. థ్రిల్

ఓ యువకుడిని క్రిమినల్ కేసులో పోలీసులు అరెస్ట్ చేస్తారు. అతన్ని విడిపించడానికి ఓ క్రిమినల్ లాయర్ కేసును టేకప్ చేస్తుంది. గురువారం హీరో రామ్‌చరణ్ విడుదల చేసిన 'అహింస' ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలు ఇవి. మరోవైపు అదే ట్రైలర్‌లో ఆ యువకుడు, ఓ యువతి ప్రేమలో ఉన్న సీన్లు కనబడతాయి. దివంగత ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు మనవడు, నిర్మాత సురేష్‌బాబు తనయుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. గీతిక హీరోయిన్‌గా లాయర్ పాత్రలో సదా నటించిన ఈ చిత్రానికి తేజ దర్శకుడు. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి పి. కిరణ్ నిర్మాత. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.


● అభిరామ్

రియల్ లైఫ్ పాత్రలు గుర్తొస్తాయి

– దేవీ ప్రసాద్


● ప్రియా, సంతోష్, అనిల్, దేవీ ప్రసాద్

''బాలకృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలతో (వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య) సంక్రాంతికి మళ్లీ ఒక కళ వచ్చింది. ఆ చిత్రాలతో పాటు మా సినిమా వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం'' అని సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ మాట్లాడుతూ– ''నాకు వెన్నుదన్నుగా ఉంటున్న నిర్మాతలు వంశీ, విక్కీ, అజయ్ అన్నలకు థ్యాంక్స్. ప్రియ నటన, కార్తీక్ సినిమాటోగ్రఫీ, శ్రవణ్ భరద్వాజ్ సంగీతం ఈ సినిమాకి ప్లస్'' అన్నారు. ''జీవితంలో నేర్చుకోవాల్సిన చాలా పాఠాలు 'కళ్యాణం కమనీయం'లో ఉన్నాయి. ఒక నిజాయితీ కథ, కథనాలతో చేసిన మూవీ ఇది'' అన్నారు అనిల్ కుమార్ ఆళ్ల. ''తెలుగులో నాకిది మొదటి సినిమా'' అన్నారు ప్రియా భవానీ శంకర్. ''ఈ సినిమా చూశాక ప్రేక్షకులకు వాళ్ల రియల్ లైఫ్‌లోని పాత్రలు, కొన్ని ఘటనలు గుర్తొస్తాయి'' అన్నారు దేవీ ప్రసాద్.

దేశం కోసం...


● రవీంద్ర

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'. గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలను నిర్మించిన రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని స్వీయదర్శకత్వంలో నిర్మించారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ కుమార్, కెమెరా: సీవీ ఆనంద్.